క్లుప్తంగా

14న కొబ్బరి రైతుల రాయబారం

ఏలూరు (టూటౌన్): ఈనెల 14న కొబ్బరి రైతుల చలో ఏలూరు కలెక్టరేట్, జిల్లా కలెక్టర్‌కు రాయబారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహా, కార్యదర్శి కె.శ్రీనివాస్‌లు కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కొబ్బరి రైతుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 14 ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు జిల్లాలోని కొబ్బరి రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కనీస ధరలు రాక కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొబ్బరి రైతులకు ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింప చేయాలని కోరారు. నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి కొబ్బరికాయలు కొనుగోలు చేయలన్నారు.

17 నుంచి బస్సు యాత్ర

ఏలూరు (టూటౌన్): ఈ నెల 17 నుంచి వచ్చేనెల 8 వరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహించనున్నట్టు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తెలిపారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. యాత్ర 17న విశాఖలో ప్రారంభమవుతుందని, రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పర్యటించి వచ్చే నెల 8న తిరుపతిలో భారీ బహిరంగ సభతో ముగుస్తుందని చెప్పారు. సభకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరవుతారని తెలిపారు. బస్సు యాత్ర ఈనెల 23న ఏలూరు జిల్లాలో ప్రవేశిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలి

ఏలూరు (టూటౌన్): కేంద్రం అనుసరిస్తోన్న ప్రజావ్యతిరేక, రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపు నిచ్చారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో ఎం.వెంకటాచారి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సీపీఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మోదీ పాలనకు చరమ గీతంపాడాలన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజేంద్ర మాట్లాడుతూ ఆగస్టు 17 నుంచి సెప్టెంబరు 8 వరకు నిర్వహించే బస్సు యాత్రకు యువజన సమాఖ్య కార్యకర్తలు 100 మంది మోటారు సైకిళ్లతో పాల్గొంటారని తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడారు. నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి హేమశంకర్, బత్తుల వెంకటేశ్వరరావు, కారం ధారయ్య, బాడిస రాము, పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, కంచర్ల గురవయ్య, జమ్మి శ్రీను, టీవీఎస్ రాజు, జేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆర్థిక భరోసా

- వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫాలతో సాయం
- ఏలూరులో 100 జంటలకు రూ.69 లక్షల లబ్ధి

ఏలూరు (టూటౌన్): పేదలు తమ పిల్లలను చదివించి వారి వివాహాన్ని గౌరవప్రదంగా జరిపించి తమ సామాజిక బాధ్యత నిర్వర్తించేలా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం పేరిట ఆర్థిక సాయం అందజేస్తోంది. ముస్లిం మైనార్టీ వర్గాల ఆడపిల్లలకు వైఎస్సార్ షాదీతోఫా ద్వారా ఆర్థిక సాయం అందిస్తోంది వైఎస్ జగన్ ప్రభుత్వం. ఏలూరు నియోజకవర్గంలో 2023 ఏప్రిల్ – జూన్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 100 జంటలకు ప్రభుత్వం ఇటీవల ఆర్థిక సాయం విడుదల చేసింది. ఈ నెల 9న కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ పథకానికి సంబంధించిన నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. నియోజకవర్గంలో కొత్తగా వివాహం చేసుకున్న వంద జంటలకు ప్రభుత్వ సాయం అందడంతో నూతన వధూవరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సాయం వల్ల ఆర్థిక కారణాలతో మధ్యలోనే విద్యను నిలిపి వేసే అవకాశం బాగా తగ్గుతుందని భావిస్తున్నారు.

వంద జంటలకు లబ్ధి

వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకం ద్వారా ఏలూరు నియోజకవర్గంలో గత త్రైమాసికంలో వివాహం చేసుకున్న 100 జంటలకు రూ.69 లక్షల మేరకు లబ్ధి చేకూరింది. నియోజకవర్గం పరిధిలో కులాంతర వివాహం చేసుకున్న 15 జంటలకు రూ.12.60 లక్షలు, ఒకే సామాజిక వర్గానికి చెందిన 77 జంటలకు రూ.48.50 లక్షలు, భవన నిర్మాణకార్మిక కుటుంబానికి చెందిన ఒక జంటకు రూ.40 వేలు, దివ్యాంగులు ఒక జంటకు రూ.1.50 లక్షలు వైఎస్సార్ కళ్యాణమస్తులో ఆర్థికసాయం అందింది. వైఎస్సార్ షాదీ తోఫా పథకంలో ఆరు జంటలకు రూ.6 లక్షలు ఆర్థిక సాయం ప్రభుత్వం అందించింది.



వైఎస్సార్ కళ్యాణ మస్తు, షాదీ తోఫా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, నగర మేయర్ తదితరులు (ఫైల్)

మాటిచ్చారు.. అమలు చేశారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆడపిల్లల విద్యను ప్రోత్సహించేలా వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఈ పథకం ద్వారా మాకు ఆర్థిక సాయం అందడం వల్ల ఎంతో ఉపయోగపడనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– జి.రామకృష్ణ, లలితా రాణి, ఏలూరు, వైఎస్సార్ కళ్యాణ మస్తు లబ్ధిదారు

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ముస్లిం మైనార్టీల్లో బాలికా విద్యను ప్రోత్సహించేలా సీఎం జగన్ ప్రవేశ పెట్టిన వైఎస్సార్ షాదీ తోఫా పథకం ఎంతో బాగుంది. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. వైఎస్సార్ షాదీ తోఫా ద్వారా మాకు రూ.లక్ష సాయం అందింది. ఈ సొమ్ము మా భవిష్యత్ అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడింది.

– షేక్ ఆయిషా, షేక్ ఇమ్రాన్, శనివారపుపేట, షాదీతోఫా లబ్ధిదారులు

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యువత తమ బంగారు భవిష్యత్‌ను తామే తీర్చిదిద్దుకోవాలని, ఉన్నతమైన లక్ష్యాలను అకుంఠిత దీక్షతో చేరుకోవాలని సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహరాజ్ పిలుపు నిచ్చారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ యువజన దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది సుస్థిర ప్రపంచం కోసం యువతకు హరిత నైపుణ్యం అనే అంశంపై అంతర్జాతీయ యువజన దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్లోబల్ వార్మింగ్, ప్లాస్టిక్ వినియోగం నిరోధించడంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత యువతపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు రాఘవాపురానికి చెందిన స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ సహకారంతో జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వయోజన విద్య ఏపీఓ విజయకుమార్, సెట్‌వెల్ ఏఓ కేజే కెనడీ, పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ ఎస్ పట్టాభి రామన్న, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు అందని స్వాతంత్య్ర ఫలాలు



కరపత్రం విడుదల చేసిన సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): దేశంలో అత్యధిక జనాభాగా ఉన్న ఎస్సీ, ఎస్టీలకు నేటికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం, న్యాయం అందని పరిస్థితి ఉందని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, సామాజిక కార్యకర్త డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక నరసింహారావుపేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో దేశ స్వాతంత్య్రం – నేటి పాలకుల పరిస్థితి అనే అంశంపై నిర్వహించిన సదస్సులో సంతోష్ కుమార్ మాట్లాడారు. మనకు స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్ల దాటినా దేశంలో ఉన్న కులవ్యవస్థ ఆధారంగా మనిషిని మనిషిగా చూడలేని దౌర్భాగ్యం దేశంలో ఉందని చెప్పారు. దీన్ని నిర్మూలించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని అన్నారు. స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లైనా వాటి పూర్తి ఫలాలు నేటికీ ఎస్సీ, ఎస్టీలకు అందని ద్రాక్షలాగానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్య్ర భారతావనిలో సమానత్వం అనేది నేటికీ ప్రజల మధ్యన ఉండకపోవడం దారుణమన్నారు. ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేసి దేశానికి స్వాతంత్య్ర తీసుకొస్తే దేశంలో నేటికీ వివక్షత చూపడం అనేది మనల్ని మనం కించపర్చుకోవడమే అని అభిప్రాయపడ్డారు. ఎక్కడైతే వివక్షత ఉంటుందో అక్కడ పోరాటం ఉంటుందని, ఆపోరాట దిశగా ప్రజలు పయనించే అవకాశం ఇవ్వకుండా పాలకులు మానవ హక్కులను కాపాడే విధంగా ముందుకు సాగాలని కోరారు. తొలుత సదస్సు కరపత్రాన్ని విడుదల చేశారు.

యుద్ధ విద్యల్లో ప్రావీణ్యం అవసరం



కుంగ్‌ఫూ విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేస్తున్న డీఈఓ శ్యామ్ సుందర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేటి పరిస్థితుల్లో బాలికలు, మహిళలు, యువతులకు యుద్ధ విద్యల్లో ప్రావీణ్యం అవసరమని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ సూచించారు. న్యూమాంక్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు బాలలకు కలర్ బెల్టులను శనివారం ఆయన జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ ఇటీవల బాలికలు, యువతులపై జరుగుతోన్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఇటువంటి విద్యలు ఉపయోగపడాతయన్నారు. ఈ విద్యల్లో ప్రావీణ్యం సంపాదించడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, తమను తాము రక్షించుకోవడంతో పాటు తమ తోటి వారినీ రక్షించుకునే నైపుణ్యం వారి సొంతమౌతుందని చెప్పారు. ఇటువంటి విద్యలకు మరింత ప్రాచుర్యం కల్పించి ఎక్కువ మంది ఈ విద్యను నేర్చుకునేలా ఆయా సంఘాలు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కుంగ్‌ఫూ విద్యలో శిక్షణ ఇస్తున్న మహిళా ఇన్‌స్ట్రక్టర్ జి.సరస్వతి రాఘవ, కిడ్స్ ఇన్‌స్ట్రక్టర్ నికితా శ్రీలను అయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం న్యూమాంక్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్ ఆఫ్ ఏపీ కోశాధికారి జీవీ రాఘవ ఆధ్వర్యంలో చిన్నారులకు కలర్ బెల్టుల ప్రదాన చేశారు.

క్విజ్, చర్చల ద్వారా అవగాహన



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏదైనా ఒక విషయం గురించి మాట్లాడినా, చర్చ చేసినా, క్విజ్‌లో పాల్గొన్నా విద్యార్థుల అవగాహన పెరగడానికి సహాయ పడుతుందని బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ వై.ఆనంద నాయుడు, ఇంగ్లిష్ రిటైర్డ్ లెక్చరర్స్ డి.దిలీప్ కుమార్, పి.ఆంజనేయులు అన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం స్థానిక సుబ్బమ్మదేవి హైస్కూల్లో ఏలూరు పరిసర ప్రాంతాల హై స్కూల్ విద్యార్థులకు వక్తృత్వ, కాలేజీ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీలో సీఆర్ రెడ్డి ఇంటర్ విద్యార్థులు సీహెచ్ నగేష్, ఏవీఎస్ఎన్‌డీ కుమార్, ఎం హరిచరణ్ బృందం మొదటి, సీఆర్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు పీజేఎస్ సిద్ధార్థ, బి.త్రినాథ్ బృందం రెండో స్థానంలో నిలిచారు. స్వాతంత్య్ర పోరాటంలో అల్లూరి సీతారామరాజు, మన్య విప్లవం పాత్ర అనే అంశంపై తెలుగులో వక్తృత్వ పోటీలో ఎస్కే రెహానా (జింగిల్ బెల్స్), టి.పుష్కల (శ్రీ శ్రీ స్కూల్), కె.తేజకిరణ్ (శ్రీ సూర్య ఇంగ్లిష్ మీడియం స్కూల్), జి.దివ్య (ఎల్‌బీసీ స్కూల్), ఆర్ హరీశ్వర్ (కేపీడీటీ హై స్కూల్), ఇంగ్లిష్‌లో ఆర్.శ్వాస్ (భాష్యం స్కూల్), డి.కార్తీక (శ్రీదీప్తి స్కూల్), ఆర్ గీతా చిన్నారి (ఏఆర్‌డీజీకే హై స్కూల్) వరుస స్థానాలు సాధించారు. వీరికి ఈనెల 15వ తేదీ సాయంత్రం కోటదిబ్బలోని సీతారామ భర్తియా కళ్యాణ మండపంలో జరిగే సభలో బహుమతులు ప్రదానం చేస్తామని విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యురాలు జి.శారద తెలిపారు. 100వ వర్ధంతి సందర్భంగా మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాన్ని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పి.ఆంజనేయులు, జి.శారద, ఎస్ గంగా భవాని, కె.లెనిన్ బాబులు నిర్వహించారు. కార్యదర్శి గుడిపాటి నరసింహారావు పర్యవేక్షించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	50	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	44-80
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05-07
బెండకాయలు	24	కంద	36
పచ్చిమిర్చి	60-68	బీట్‌రూట్	36
కాకర కాయలు	50-60	కీరా దోస	40
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	44	అల్లం	140-240
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	17
క్యారెట్	36	పాలకూర	15
దొండకాయలు	32	చుక్కకూర	15
బంగాళదుంపలు	26	తోటకూర	12
ఉల్లిపాయలు	26	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	36	బఠాణీ	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-30	చిలకడదుంప	36

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	12
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	12
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	23
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	14
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	12
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	17
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	10
ఏలూరు -బీహెచ్ఈఎల్	08.00	4794	రద్దు
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	12
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	రద్దు
ఏలూరు -తిరుపతి	16.00	4830	21

డీఈఎల్ఈడీ పరీక్షకు 172 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్ఈడీ 3వ సెమిస్టర్ పరీక్షలకు 154 మంది విద్యార్థులకు 150 మంది, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షకు 72 మందికి 22 మంది శనివారం హాజరయ్యారు. ఈ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ తెలిపారు.

వైఎస్సార్ కంటివెలుగు పరీక్షల పరిశీలన

పెదపాడు: మూడో విడత డాక్టరు వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలు ప్రతి ఒక్కరికీ నిర్వహించాలని ఏలూరు డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టరు ఆశా తెలిపారు. పెదపాడు మండలంలోని కొక్కిరపాడు గ్రామ శివారు దాసరి గూడెంలో వైఎస్సార్ కంటివెలు పరీక్షలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వారికి పలు సూచనలు సలహాలు అందించారు. కంటి వెలుగు పరీక్షల రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ సేవలు సక్రమంగా అందించేలా ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది చర్యలు చేపట్టాలని వారి ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న ఆహార పదార్థాలను రుచి చూసారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అసిస్టెంట్ దివ్య, ఎంపీహెచ్ఈఓలు బసవరాజు, హెల్త్ సూపర్‌వైజర్‌లు కృష్ణారావు, పీ రవీంద్రబాబు, హెల్త్ అసిస్టెంట్ జీ వడ్డికాసులు, ఏఎన్ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మేధినరావుపాలెంలో నా భూమి.. నా దేశం



నా భూమి.. నా దేశం స్థూపాన్ని ప్రారంభించిన సర్పంచ్ దుర్గాకుమారిరాజు

దెందులూరు: మేధినరావుపాలెంలో నా భూమి.. నా దేశం స్థూపాన్ని సర్పంచ్ ఎం.దుర్గాకుమారిరాజు శనివారం ప్రారంభోత్సవం చేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మేడికొండ వెంకటేశ్వరరావు, మేడకొండ రాజా, గ్రామ కార్యదర్శి సుమలత, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ వాసే రమేష్, వార్డు మెంబర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం సహాయనిధి



కొండలరావుపాలెంలో నాగేంద్రకు రూ.3 లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కొంత కాలంగా తలసేమియా సమస్యతో బాధపడుతూ, ఆసుపత్రులకు తిరుగుతూ వైద్య ఖర్చుల కోసం సతమతమవుతున్న పొన్నూరి నాగేంద్ర సమస్యను స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్య తీవ్రతను గమనించిన ఎమ్మెల్యే బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం పెదవేగి మండలం రాయన్నపాలెంకు చెందిన పొన్నూరు నాగేంద్రకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.3 లక్షల చెక్కును మంజూరు చేయించారు. బాధితుడికి శనివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కు అందించారు. ఈ కార్యక్రమంలో పర్వతనేని నారాయణేశ్వర్, పులపాక గాంధీ, పర్వతనేని జగన్, మాట్టా వరప్రసాద్, మంచినేని బుల్లియ్య, పొన్నూరి సత్యనారాయణ, చల్లారి సత్యనారాయణ, పొన్నూరి శోభన్‌బాబు, పామర్తి వీర్రాజు, పులపాకరాటాలు పాల్గొన్నారు.


దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ



గుండుగొలనులో దివ్యాంగులకు నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమడోలు: దివ్యాంగులను ఆదుకోవడం సమాజానికి సేవలందించడమేనని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగునేని వరప్రసాద్ అన్నారు. గుండుగొలనులో విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం గ్రామానికి చెందిన కొనకళ్ల మోహనరావు, అనంత్ వితరణతో 60 మంది దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు, పండ్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగునేని వర ప్రసాద్, భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్, విజయవాడకు చెందిన ప్రముఖ గుండె, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ ఎల్ సురేష్, తెర్లి భానురేఖ పాల్గొని ప్రసంగించారు. వైద్యులు తెర్లి సురేష్, తెర్లి భానురేఖ మాట్లాడుతూ తమ వంతు సేవా సమితికి అండదండగా ఉంటామని, ప్రతి నెల గ్రామంలోని ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సేవా సమితి నిర్వాహకులు, పెద్దలు పాల్గొన్నారు.

ఓటర్ల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి



బీఎల్వోలతో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ

పెదపాడు: కలెక్టరు ఆదేశాల మేరకు బీఎల్వోలు ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి వారి వివరాలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని డిప్యూటీ కలెక్టరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యనారాయణ తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఈఆర్‌ఓ సత్యనారాయణ మాట్లాడుతూ పెదపాడు మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో బీఎల్వోలు ఇంటింటికీ తప్పనిసరిగా వెళ్లి వారి వివరాలు నమోదు చేయాలని సూచించారు. చనిపోయిన ఓటర్లను తొలగించాలన్నారు. గ్రామంలో లేని వారి ఓట్లు తొలగించాలన్నారు. వికలాంగుల ఓట్లు ప్రత్యేకంగా నమోదు చేయాలన్నారు. 80 ఏళ్ల దాటిన ఓటర్ల వివరాలు ప్రత్యేకంగా నమోదు చేయాలని సూచించారు. బీఎల్‌ఓలు పారదర్శకంగా వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ యస్‌వీడీవీ ప్రసాద్‌బాబు బెవర కోటేశ్వరరావు, పుట్టా అజయ్, దామరాజు రవికుమార్, నటరాజన్‌దాసు బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పొదుపుతోనే భద్రత

దెందులూరు: పొదుపుతోనే భద్రత, అభివృద్ధి, సమాజంలో గౌరవం లభిస్తుందని మేధినరావు పాలెం సర్పంచ్ ఎం.దుర్గాకుమారి రాజు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సున్నా వడ్డీ నిధులు విడుదల సందర్భంగా డ్వాక్రా సంఘాల విస్తృత సమావేశం గ్రామ సచివాలయంలో నిర్వహించారు. తొలుత గ్రూపుల వారీగా పొదుపు, చేస్తున్న వ్యాపారాలు తిరిగి బ్యాంకులకు చెల్లిస్తున్న రుణాలు, రికార్డుల్లో తీర్మానాలపై అన్ని డ్వాక్రా సంఘాలతో సర్పంచ్ సమీక్షించారు.

లీగల్ హెచ్చరిక

నా క్లయింట్ అయిన శ్రీమతి అంగులూరి లక్ష్మీ పార్వతి, భర్త : వెంకటేశ్వర రావు, R/O మాదేపల్లివారు ఉత్తర్వులను అనుసరించి యావన్మందికి తెలియజేయునది ఏమనగా అధీకృత అధికారి, కెనరా బ్యాంకు, ఏలూరు శ్రీ గజమహా విద్యాలయ బ్రాంచ్ వారు ది.05.08.2023వ తేదీన సాక్షి పేపరు నందు ప్రసాదపు వీరరాజు, తండ్రి: నాగభూషణం R/O మాదేపల్లి వారి లోను బాకీ నిమిత్తం మరియు శ్రీమతి ప్రసాదపు శారద, భర్త: వెంకటేశ్వరరావు, చిరునామా: ఏలూరు ఆర్.ఆర్.పేట, కెనరా బ్యాంకు లోను బాకీ నిమిత్తం మరియు మెసర్స్ గీతా ఎంటర్‌ప్రైజెస్ లోను బాకీ నిమిత్తం ప్రసాదపు వెంకటేశ్వర రావు, ప్రసాదపు సాయిబాబు, ప్రసాదపు వీరరాజు గార్లకు చెందిన ఆస్తులను వేలం వేయుటకు ఇచ్చిన ప్రకటనలు చెల్లవు. సదరు ప్రకటన లలోని షెడ్యూలు ఆస్తులు మా క్లయింట్ యొక్క ఉమ్మడి కుటుంబ ఆస్తులు అయివుండి. మా క్లయింట్‌కు 1/4వ వంతు అవిర్భక్తపు హక్కు సదరు ఆస్తుల యందు కలదు. మరియు 2వ అదనపు జిల్లా జడ్జి, ఏలూరు జిల్లా, ఏలూరు వారి కోర్టు నందు O.S.No. 154/2018 దావా పార్టీషన్ కొరకు పెండింగు లో ఉన్నది. సదరు కేసులో బ్యాంకు వారు కూడా ప్రతివాదిగా ఉన్నారు. కాని సదరు దావా సంగతులను మరుగునపర్చి ఆస్తుల వేలం కొరకు ఇచ్చిన ప్రకటన పూర్తిగా చట్ట విరుద్ధం మరియు నా క్లయింట్ చట్టబద్ధ హక్కులను బైండ్ చేయజాలవు. కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఎవరైనా బ్యాంకు వారితో షెడ్యూలు ఆస్తులకు సంబంధించి ఏవిధమైన లావాదేవీలు కొనసాగించిన యెడల తీవ్రంగా నష్ట పోవుదు రని వారి అందరి మీదా సివిల్, క్రిమినల్ కేసులు తీసుకొనబడునని హెచ్చరించడమైనది.

సం/-.
ఏలూరు, తేది :10.08.2023
కంతుల శ్రీకృష్ణ దత్తు, న్యాయవాది,ఏలూరు